# అనేకత్వములోని ఏకత్వమును నిరూపించేదే వేదము

**వేదవిద్యలన్ని వెలయంగ తా నేర్చి**
**నేర్పు మాటలందు నిపుణుడైన**
**సద్గుణంబులేక సంస్కారి కాకున్న**
**పదునులేని భూమి పండినట్లు**

దివ్యాత్మ స్వరూపులారా!

భారతీయ విజ్ఞానమునకు మూలాధారము వేదము. ఇది అనంతవిజ్ఞానము. యితిహాస పురాణములయందుకూడను యిదియే తిరిగి ప్రత్యక్షమవుతున్నది. సంస్కారమునకు, సమత్వమునకు యిది పునాది వంటిది. ధర్మజిజ్ఞాసకు తరగని ఖని. ఆదర్శములు అందించుటకు గొప్ప నిధి. ప్రపంచములో ప్రప్రథమముగా వెలువడిన కావ్యము, వేదము. ఇది భారత జాతి చరిత్రకు ప్రప్రథమమైన గ్రంథము. భారతీయుల ప్రమాణములన్నియుకూడను వేదములపైననే ఆధారపడివున్నవి. భారతీయులకు ప్రధానము, ప్రమాణము అయినదే వేదము.

**ఋగ్వేదము సాక్షాత్తూ భగవత్స్వరూపమే!**

వేద చతుష్టయమునందు ఋగ్వేదము మొట్టమొదటిది. ఋగ్వేదము సాక్షాత్ భగవత్ స్వరూపమే. భగవంతుని వర్ణన గావించే విపులమైన ఒక మంత్ర సమూహము ఇది. ఋగ్వేదము అనేక దేవతలు కలరని చాటుతూ వచ్చింది. నూర్లు కాదు, వేలు కాదు, లక్షలు కాదు, కోట్ల దేవతలతోకూడినదే యీ ప్రపంచమని తెలుపుతూ వచ్చింది. దీనియొక్క

sri sathyasai vachanamrutam

అంతరార్థము యేమిటి? 'ప్రతి జీవుడు దేవుడే' అనే సత్యాన్ని ప్రకటింపచేస్తూ వచ్చింది. ప్రతి మానవునియందుకూడను దివ్యమైన ఆత్మ దైవస్వరూపముగా వుండటంచేత ప్రతి జీవుడు దేవుడనే సత్యాన్ని ప్రకటితము చేసింది. వేదమునందుండిన దైవత్వాలుకూడను మానవాకారముతో వున్నవని నిరూపణ చేస్తూవచ్చింది. లోకసంరక్షణ నిమిత్తమై సూర్యుడు ప్రధానుడు. ఇలాంటి సూర్యునకుకూడను కొన్ని రూపములు కలవని నిరూపిస్తూవచ్చింది. సూర్యునియొక్క కిరణములే హస్తములనియు, జ్వాలలే నాలుకలనియు ప్రకటితము చేస్తూవచ్చింది. అగ్ని యజ్ఞయాగాదిక్రతువులకు అతి ప్రధానమైనది. యజ్ఞకాలమునందు 'అరణి' అనే ఒక కఱ్ఱను మథనము చేయుటద్వారా అగ్ని ఆవిర్భవిస్తున్నాది. ఈ అగ్నికి తల్లితండ్రులు కలరని నిరూపించింది, ఋగ్వేదము. దీనిని మథనము చేయుటకు రెండు కఱ్ఱలు వుంటాయి. క్రిందనొక కఱ్ఱ పైననొక కఱ్ఱ యీ రెండింటి మథనము చేతనే అగ్ని ఆవిర్భవిస్తుండాది. కనుక యీ రెండు కఱ్ఱలే అగ్నికి తల్లి, తండ్రి అని నిరూపిస్తూవచ్చింది. అంతేకాక ఈ అగ్ని పుట్టిన తక్షణమే తల్లితండ్రులను మ్రింగునది అని నిరూపిస్తూ వచ్చింది. అరణి మథనంద్వారా ఉద్భవించటంచేత దీనికి జన్మములు అనేకంగా వుంటాయని ప్రబోధిస్తూ వచ్చింది. అగ్నికి ధూమమే శబ్దము. ధూమము తనను ఆవిర్భవించటంచేత అగ్నికి 'ధూమపాదుడు' అనే పేరు వచ్చింది. ఈ అగ్ని యజ్ఞయాగాదులకు సారథిత్వాన్ని వహిస్తుండాది. దేవతలనుకూడను అగ్నియే తన రథముపైన తీసుకొనివచ్చుచున్నదని ఋగ్వేదముయొక్క ప్రమాణము. మానవులు యజ్ఞమునందు అర్పితముచేసే ఆహుతులన్నియుకూడను యీ అగ్నిద్వారానే దేవతలకు అందుతున్నాయి. ఇక్కడ దేవతలకు, అగ్ని అందించే ఆహుతులకు వున్న సన్నిహిత సంబంధమేమిటి? ఈ అన్నింటిని తాను స్వయముగా ఒక విధమైన అధికారస్థానము వహించి యజ్ఞయాగాదిక్రతువులకు తాను మూలాధారమై నిల్చటంచేత యీ అగ్నికే 'బ్రహ్మ' అని ఋత్విక్కులు పేరు పెట్టారు. ఇంతేకాదు, యీ విధంగా అధికారము వహించటంచేత 'హోత' అనికూడ పిలుస్తూవచ్చారు. కనుకనే అగ్నిని అనేక పేర్లతో యీ యజ్ఞమునందు ఆహ్వానము చేస్తూవచ్చారు, ఋత్విక్కులు.

**ఇంటియందు, వంటియందుకూడ అగ్నియే ప్రధానమైనది, ఆధారభూతమైనది**



sri sathyasai vachanamrutam

అగ్ని మానవునితో అనేక విధములైన సంబంధములు కలిగి వుంటున్నది. అగ్ని లేక మానవుడు ఒక్క క్షణమైనాకూడను తన జీవితాన్ని గడపలేడు. తెల్లవారి లేచిన మొదలు యింటిలో కార్యక్రమం అగ్నితో ప్రారంభమవుతుంది. మానవుడు తాను భుజించే ప్రతి ఆహారపదార్థమునుకూడను అగ్నిచేత పరిపక్వము గావించుకుంటున్నాడు. ఇంటియందు, వంటియందుకూడను అగ్నియే ప్రధానము, ఆధారము. అగ్నిలో ఆహుతి చేస్తున్నారు, పదార్థములు. వాటిని అగ్ని దేవతలకు అందించుచున్నదని ఒక ప్రమాణము. ఇక్కడ మానవుని జీవితములో దీనియొక్క ప్రధానమైన ఆధారములు విచారించినప్పుడు మన జఠరాగ్నియే యిందులో హోమగుండము. ఇందులో వేసిన సమస్త పదార్థములుకూడను జీర్ణము గావించి రసస్వరూపమైన రూపాన్ని ధరింపచేసి సర్వాంగములకు సరఫరా చేస్తుంది, జఠరాగ్ని.

ఉపనిషత్ వాక్యప్రమాణముననుసరించి 'రసోవైసః' అనగా భగవంతుడు రసస్వరూపుడు. ఈ రసము మానవునియొక్క ప్రతీ అంగమునందుకూడను నిండివుంటున్నది, చేరి వుంటున్నది. అందువలననే భగవంతునికి అంగీరసుడు అని ఒక పేరు పెట్టారు. ప్రతి అంగమునందు రసస్వరూపుడై పరమాత్ముడు వుండటంచేతనే యితనికి 'అంగీరసుడు' అని పేరు. ఈ రసస్వరూపము యెచ్చటనుండి వచ్చినది? జఠరాగ్నినుండి వచ్చింది. ఈ అగ్నిద్వారానే రసమయమైన స్వరూపాన్ని అంగములకు సరఫరా చేస్తూ వచ్చింది.

**ఋగ్వేదము మానవత్వములోని ఏకత్వమును స్పష్టముగా నిరూపించింది**

అదే విధముగనే యాగమునందు అర్పితం గావించిన పదార్థములను అగ్ని రసమయముగా మార్చి ధూమముద్వారా యావత్ ప్రపంచమునకుకూడను ప్రసరింపచేస్తూ వస్తున్నది. ఇట్టి అంతరార్థమును ప్రబోధించే పండితులు లేకపోవటంచేతనే ఈనాడు యజ్ఞయాగాదిక్రతువులు హాస్యాస్పదముగా తయారౌతూవచ్చాయి. ఇంతేకాదు, వేదకాలములో వుండిన సహనము, సానుభూతి, సమత్వమనే దానిలో వెయ్యింట ఒక్క భాగమైనా నేడు కన్పించటంలేదు. వేదము మహోన్నతమైన తత్వాన్ని ప్రబోధించింది.



srisathyasaivacchanamrutam

అభిన్నత్వాన్ని ప్రకటితం గావించింది. ఏకత్వమే ప్రధానమైన లక్ష్యమని తెలుపుతూవచ్చింది.

ఋగ్వేదములోని శాంతిమంత్రమునందు

**ఓం సహనావవతు సహనౌభునక్తు**
**సహ వీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

అని చెప్పబడింది. దీనియొక్క అంతరార్థమేమిటి?

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి కలిమి చెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసిమెలసి తెలుసుకున్న తెలివిని వెలిగించుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**
**శాంతి శాంతి శాంతి యనుచు శాంతి పూజ చేయుదాం**

కట్టకడపటికి 'శాంతి శాంతి శాంతి' యని శాంతిని దేశానికి పంచుదాం అని, బోధించింది. ఈవిధంగా మానవత్వమనే యేకత్వాన్ని ఋగ్వేదము స్పష్టముగా నిరూపిస్తూ వచ్చింది. సంకుచితమైన బుద్ధులను కలిగినవారు, స్వప్రయోజనాల నిమిత్తమై దీనిని వుపయోగించుకొనేవారు, అనేక భేదములు కల్పించి, భిన్నత్వాన్ని నిరూపిస్తుంది వేదమని ప్రచారం గావిస్తూవచ్చారు.

## వేదములలో ప్రధానమైనది ఋగ్వేదము

వేదములో యెట్టి భేదములేదు. వేదము కేవలము సమత్వము, సానుభూతి యిలాంటి పవిత్రమైన సుగుణములను ప్రకటితం చేస్తూవచ్చింది. వేదములో ప్రధానమైనది ఋగ్వేదము. ఈ ఋగ్వేదమే సర్వవేదములయందుకూడను తన స్వరూపాన్ని ప్రకటితం గావిస్తూవచ్చింది. అధర్వణవేదములోపల యీ ఋగ్వేదముయొక్క తత్వములు, సూక్తులు వెయ్యిరెండువందలయిరవై చేరివుంటున్నాయి. నాలుగు వేదములందుకూడను

sri sathyasai vahanamrutam

ఋగ్వేదము ఒక సమత్వాన్ని నిరూపిస్తూవచ్చింది. సామవేదములో వున్న సూక్తులన్నీకూడను ముక్కాలు భాగము ఋగ్వేదములోనివిగానే కన్పిస్తున్నాయి.

యజుర్వేదములో వుండిన మంత్రములన్నియు యీ ఋగ్వేదముయొక్క మంత్రములుగానే నిరూపిస్తూవచ్చింది. యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములలోకూడను ఋగ్వేదము సమత్వాన్ని వహిస్తూవచ్చింది. అందుకే ఋగ్వేదమును ప్రధానమైన అంగముగా భావిస్తూవచ్చారు, ఆనాటి ఋషులు. ఋగ్వేదము కేవలము భగవంతునియొక్క స్తుతిని గావించే మంత్రస్వరూపము.

**పంచభూతములు పరమాత్మ స్వరూపములు**

'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్' అనగా యీ వేలాది శిరస్సులు, వేలాది నేత్రములు, వేలాది పాదములు అన్నియుకూడను తనవే అని స్పష్టము చేస్తూ వచ్చింది. ప్రతిమానవుడు మాధవాకారుడే! కాని యింద్రియముల సంపర్కము పొంది తన స్వరూపాన్ని మరచి దేహమే తానని విశ్వసించి అజ్ఞానమునకు గురి అవుతున్నాడు. ఈ దేహేంద్రియ భావము క్రమక్రమేణా తొలగించుకున్నప్పుడు తాను ప్రత్యేకమైన అనుభవమును పొందనక్కరలేదు. తాను తానుగానే నిలచివుంటాడు. ఇట్లు అనేకత్వములోని యేకత్వము నిరూపించేదే వేదము. వేదములను ఫలానా తెగవారు వల్లించకూడదు, ఫలానావారే వల్లించాలి. వీరు దీనికి అర్హులు, వీరు దీనికి అర్హులుకారు అని నిర్ణయించే అధికారము యెవ్వరికిని లేదు. వేదకాలమునాటి మానవులయందు యీనాటి కులవర్ణమతవర్గములనేవి యేమాత్రము లేవు. నేడుకూడను యివి లేనివే! కాని, కొంతమంది సంకుచిత భావము కల్గినవారు ఈ భేదములను అనేక విధములుగా ప్రోత్సహించి, పోషించి, దేశమును అనేక విధములుగా విభజిస్తూ వస్తున్నారు. పంచభూతములు, పరమాత్మ స్వరూపములు! పరమాత్మునికే భేదములేనప్పుడు యీ జీవాత్మకెందుకు భేదము? పరమాత్మకు యెట్టి కులములు లేవు, మతములు లేవు. పరమాత్ముడు అంతటా వున్నాడు. అంతములేనివాడు. ఈ పంచభూతములకు యే విధమైన తెగలు లేవు. నీటిదే మతము? నిప్పుదే కులము? గాలిదే కులము? గగనానిదే కులము? వీటిని కుల రహితముగా అనుభవిస్తున్నామా లేదా?

srisathyasaivachanamrutam

నీరు త్రాగేముందు నీరుదే కులము అని యెవరైనా విచారించి త్రాగుతున్నారా?

కేవలము దేహేంద్రియములయొక్క భిన్నత్వమే యీ విధమైన సంకుచిత భావములను అభివృద్ధిపరుస్తూ వస్తున్నది. వైదికపరమైన కర్మనిష్ఠయందు కావించే పనులన్నికూడను యేకత్వాన్ని అభివృద్ధిపరుస్తూ వస్తున్నాయి. కనుక, యీనాడు మనము యెట్టి భేదములకుకూడ అవకాశమునందించరాదు. దైవము ఒక్కడే, దేహము లనేకము. అనేకమునందు యేకత్వమైన దైవత్వాన్ని మనం విశ్వసించాలి. ఇట్టి ఐకమత్యాన్ని మీరు సంపాదించినప్పుడే దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని అర్థం చేసుకోగలుగుతాము. ఐకమత్యం చెదరిపోవటంచేత ఆత్మతత్వము దూరమవుతుంది. త్యాగభావములు దూరముకావటంచేత రోగభావములు పెరిగిపోతున్నాయి. కనుకనే త్యాగభావాన్ని మనము ప్రత్యేకమైన రీతిలో అనుసరించాలి.

**సత్త్వరజస్తమోగుణములు మూడును మానవుని దేహమునందే ఉంటున్నవి**

ప్రపంచమునందు కొన్ని రకములుగా మనము విచారణ చేసినప్పుడు యివి గుణములచేత యేర్పడినటువంటివిగా మనకు అర్థమవుతుంది. ప్రపంచము త్రిగుణాత్మకమైనది. ప్రకృతియందు ఆవిర్భవించిన మానవునకుకూడను త్రిగుణములు ప్రధానము. అయితే ఏఏ గుణాలకు, ఏఏ కాలములలో, ఏఏ సందర్భములలో, యేయే అవకాశములందు యే విధమైన అర్హతనందించాలో అది మనం విచారణ చేయాలి. గుణములున్నవికదాయని దీనిని స్వేచ్ఛగా విభజన చేయరాదు. నలుపు తమోగుణమన్నారు. ఎరుపు రజోగుణమన్నారు. తెలుపు సాత్త్వికమన్నారు. ఇవన్నియు ప్రతినిత్యము సూర్యోదయముతోనే మనము అనుభవిస్తూ వస్తున్నాము. సూర్యోదయమునకు పూర్వము నలుపు. ప్రపంచమంతయుకూడను అంధకారము క్రమ్మివుంటుంటాది. అది క్రమక్రమేణా పైకి వచ్చేకొలది యెరుపుగా మారుతుంది. ఆ ఎరుపురంగే తీక్షణమైన స్థితిని ధరించే సమయములో తెలుపుగా మారిపోతుంది.

ఇదే విధంగా పుట్టుకచే ప్రతి ఒక్కడు శూద్రుడే, నలుపే, తమోగుణమే! క్రమంగా రజోగుణ సంపన్నుడవుతాడు. అనగా ఆకలిదప్పులకు, ఆనందవిహారములకు

srisathyasaivachanamrutam

అభిలషిస్తుంటాడు. కోరికలతో కట్టబడుతుంటాడు. ఫలితంగా మతి, స్థితి, యేవిధమైన గతికూడను వానికి తెలియదు. తనయొక్క స్థితిని మాత్రమే తాను చూసుకుంటాడు. స్వార్థము, స్వప్రయోజనములకై పాటుపడుతుంటాడు. కోరికలచేత కట్టబడివుంటాడు. ఆశలు, వాంఛలు అభివృద్ధి గాంచటంచేతనే రజోగుణంలో ప్రవేశిస్తున్నాడు. క్రమక్రమేణా యీ వాంఛలను కొంతవరకు అణగద్రొక్కుతూ రావటంచేత దైవభావాన్ని తనయందు అభివృద్ధి గావింపచేయటంచేత, లోకవాంఛలు సన్నగిల్లి, దైవభావమును పెంచుకుంటాడు. అప్పుడే వీడు సాత్త్వికరూపాన్ని ధరిస్తాడు. కనుక, తమోగుణ, రజోగుణ, సత్త్వగుణములు మూడును మన దేహమునందే వుంటున్నవి. దైవమెక్కడ వున్నాడు? మన కనుచూపులోనే వుంటున్నాడు. ఆ దైవము ఆవిర్భవించే సమయములో కనుచూపులోకూడను సత్త్వరజోతమో గుణములు ప్రకటితమవుతున్నాయి.

మన కన్నులో ముక్కాలు భాగమంతాకూడను నలుపుగానే కనిపిస్తున్నాది. ఈ నలుపుకు ఆధారమైన తెలుపే సాత్త్వికమైన తెల్ల గుడ్డుగా వుంటున్నాది. అయితే యీ నలుపుకు కొసభాగమునందు ఎరుపు అనే రజోగుణము అప్పుడప్పుడు ప్రకటితమవుతున్నాది. సృష్టికంతయుకూడను మూలాధారమైనది నేత్రము. నేత్రమునందే త్రిగుణములు కూడివుంటాయి. ఈ విధముగా ఋగ్వేదమునందు ఒక్కొక్క పదమునకు, ఒక్కొక్క సూత్రమునకు, ఒక్కొక్క మంత్రమునకు వుండిన పవిత్రతను విచారణ చేస్తే యివన్నీకూడను మానవాకారమునందే వుంటున్నవి.

**మానవ దేహమే యంత్రము, ఉచ్ఛ్వాసనిశ్వాసములే మంత్రము**

కనుక మన దేహమే ఒక యంత్రము. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములే మంత్రము. ఇదియే భగవంతునియొక్క 'గమనం, ఆగమనం' అని. ఈ ఉచ్ఛ్వాసనిశ్వాసములే వేదములని చెప్పుతూ వచ్చారు. కనుక యీ గమన ఆగమనాలు అంతా ఉచ్ఛ్వాసనిశ్వాసములు. అదియే మంత్రస్వరూపము. మన హృదయమే వీటి అన్నింటికినీ తంత్రము. దేహమనే యంత్రమునందు, హృదయమనే తంత్రమునుంచి శ్వాస అనే మంత్రములు ప్రకటితమవుతున్నాయి.

srisathyasaivachanamrutam

నిరంతరము మనము భగవంతుని ప్రార్థించే రాగతాళములతోకూడిన భావములే సామవేదము. మనము నిత్యపూజలోపల అష్టోత్తరము, సహస్రనామార్చన యిలాంటి అర్చనలంతా జరుపుతున్నాము. ఈ మంత్రములతోకూడిన అర్చనలే ఋగ్వేదము. మనయందున్న దుర్గుణములను, దురాచారములను, దుష్ప్రవర్తనలను త్యాగము చేయటానికి పూనుకుంటుంటారు. ఇది సరైన యజో మంత్రస్వరూపము. మనలను ఆవరించే ఆపదలు, దుఃఖములను యెదుర్కొని వాటితో పోరాడి, వానిని జయించటానికి తగిన కృషి చేస్తుంటాము. ఇదే అధర్వణవేదము. కనుక సామవేద, యజుర్వేద, అధర్వణవేదములన్నీకూడను మానవునియందే యిమిడివుంటున్నవి. దైవమెక్కడ అని నీవు దేవులాడనక్కరలేదు. 'తనయందే వుంటున్నాడు దైవము' అనే సత్యాన్ని యీ ఋగ్వేదము ప్రకటితంచేస్తూ వచ్చింది. అయితే మానవుడు బహిర్ దృష్టి కల్గివుండటంచేత బహిర్ముఖమైన కర్మలనాచరించి తద్వారా అంతర్ముఖములో ప్రవేశించటానికి చేసే యజ్ఞయాగాది క్రతువులన్నీ కొంతవరకు సార్థకమవుతూవచ్చాయి.

ఏదో ఒకవిధమైన కర్మాచరణముద్వారా జగత్తునకు యీ వేదములను ప్రకటితము చెయ్యాలి. సామాన్యమైన మానవులు, పామరులైన మానవులు, వేదమంటే యేమిటో తెలియని మానవులకు యీ విధమైన యజ్ఞయాగాది క్రతువులద్వారా ప్రకటితం చేయించాలి. ఏ విధమైన జ్ఞానము లేని, శాస్త్రములు యెరుగనటువంటి గోపికలుకూడను యేదో తమ భావములోపల వేదములుగా భావించుకున్నారు. క్షీరాన్ని వేదసారముగా భావించారు. గోవులన్నియు ఉపనిషత్తులుగా భావించారు. తమ జీవతత్వమునే దూడగా భావించారు. గోవునుండి వచ్చే నాల్గుభావములుకూడను వేదసారములైన క్షీరములుగా విశ్వసించారు. నాల్గు వేదములసారమే యీ క్షీరమని విశ్వసించారు. ఆ క్షీరములయొక్క చేరికయే గానమనుకున్నారు. ఇదియే వేదసారమని విశ్వసించారు. కృష్ణుని ప్రార్థించే సమయములోకూడను యీ విధమైన అంతరార్థమును పురస్కరించుకొని కృష్ణుని ప్రార్థిస్తూవచ్చారు. 'కృష్ణా! ఒక్కతూరి నీ వేణుగానము వినిపించవా', అని ప్రార్థించారు.

**పాట పాడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకు నటుల**

srisathyasaivahanamrutam

**మాటలాడుమా ముకుంద! మనసు తీరగా...... ॥పాట॥**
**వేదసారమంత తీసి నాదరూపముగను మార్చి**
**వేణువందు తిరుగబోసి గానరూపముగను మాకు. ॥పాట॥**

అదే 'రసోవైసః'. వేదరసమును గానముగా మార్చి మనోరసములో లీనముగావించే యథార్థమైన, దివ్యరసమైన భగవత్‌పరముగా రూపొందింపచెయ్యాలి, అనేది గోపికల తపన.

**గానమునందు సామగానమే ప్రధానమైనది**

సర్వగానములకు సామగానమే ప్రధానమైనది. కానీ, యీనాడు ఆ గానమునందున్న వేదరాసులు యేమాత్రము మనకు కనుపించటము లేదు. ఈ గానమునకు తగిన భావములు యీ సామవేదమునందున్న సంసిద్ధమైన సూత్రములు మనకు కనిపించటంలేదు. ఎక్కడ వేయిపన్నములు, యెక్కడ వేయి శాఖలు! ఈనాడు కేవలం రెండు శాఖలుగా మిగిలిపోయాయంటే యెన్ని శాఖలు మనము కోల్పోయినామో! క్రమక్రమేణా వీటినికూడను మనము పోషించుకొనకుండిన యీ వున్న కొన్నికూడను తొందరలో అంతరించిపోతాయి. ఇప్పటికే మానవత్వము దానవత్వముగా, పశుత్వముగా మారిపోతూ వస్తుండాది. ధర్మశాస్త్రములు యీనాడు కరవైపోయినాయి.

**అద్వైత జ్ఞానమే సరియైన జ్ఞానము**

ప్రతిమానవుడు జన్మించినది మొదలు మరణించేవరకు వేదప్రమాణమునే అనుసరిస్తూవస్తున్నాడు. తెలిసినా తెలియకపోయినా యేదో ఒక ఆచారము క్రింద భావించి దానిని అనుసరిస్తూవస్తున్నాడు. ఉదాహరణకు, బిడ్డకు నామకరణముకూడ వేదశాస్త్రము ప్రమాణమే! కేశఖండనముకూడను వేదముయొక్క ప్రమాణమే! చెవులు కుట్టటం, ఉపనయనసంస్కారము, కళ్యాణము యివన్నీ వేదముయొక్క ప్రమాణములే! వివాహసమయములో ఋగ్వేదమంత్రములైన 'ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి చరామి' అనే ప్రమాణమును చేయిస్తున్నారు. అనగా యేమిటి? ధర్మార్థకామములను మాత్రమే వేదము బోధిస్తున్నది. మోక్షమును గురించి బోధించటానికి దీనికి అధికారములేదు. మోక్షము

srisathyasaivachanamrutam

కేవలము దైవానుగ్రహముచే లభించేదే! అద్వైతభావమును అనుభవించినప్పుడే మోక్షము మనకు లభిస్తుంది. ఈ అద్వైత జ్ఞానమే సరియైన జ్ఞానము. 'అద్వైత దర్శనం జ్ఞానం', అనగా యేమిటి? అనేకత్వమునందు యేకత్వదృష్టిని మనము అభివృద్ధిపరచుకోవాలి. అందరూ దైవస్వరూపులే! విశ్వం విష్ణుస్వరూపం! సర్వం ఖల్విదంబ్రహ్మ! అంతటి తత్త్వాన్ని మనము క్రమక్రమేణా పెంచుకుంటూ రావాలి. కానీ, చాలా మంది 'ప్రయత్నిస్తాం, ప్రయత్నిస్తాం', అంటారు. Try, try, try అంటే అది dry అయిపోతుంది. Must do, చేసే తీరాలి మనము! కనుక, యే ఒక్క విషయానికి మనము 'ప్రయత్నిస్తాం' అని యే మాత్రము చెప్పకూడదు. అది ఒక బలహీనత.

**ఇష్టాన్ని బలపరచి, అయిష్టాన్ని దూరము గావించటమే వేదముయొక్క పని**

మీలో చాలా మంది కనిపెట్టారో లేదో స్వామి యేది చెప్పినా 'యిది చేస్తా, లేదా చెయ్యను' అని ఖండితంగా చెప్తారు. అంతేగాని, 'చూస్తా' అనేది నా నుంచి రానేరాదు. My life is My message నన్ను అనుసరించండి! 'చేస్తాం' అనే దృఢమైన వాగ్దానము చెయ్యాలి. ఎవరికోసం? నీకోసమే! ప్రతి విషయమునందు యీ విధమైన దీక్షను పట్టినప్పుడే కార్యాన్ని మనము ఫలింపచేసుకుంటాము. ఎంతకాలమైనా 'చూస్తాం, చూస్తాం' అని పోతుంటుంటే ఎప్పుడు చూచేది! కనుక, 'చూస్తాను' అనే మాట వద్దు, 'చేస్తాం' అనే దృఢమైన విశ్వాసముతో పూనుకోవాలి. ఆ విశ్వాసమే మన శ్వాస. ఆ విశ్వాసమే లేకపోతే శ్వాసలేని శవమే! మంచిదానిని విశ్వసించాలి. చెడ్డదానిని తీసిపారవెయ్యాలి. ఈ విధమైన నిత్యానిత్య విషయపరిశీలన జరపాలి. ఈ పరిశీలనాశక్తిని ప్రబోధించేది, ప్రసరింపచేసేది యీ ఋగ్వేదము. ఇష్టాన్ని బలపరచి అయిష్టాన్ని దూరము గావించటమే యీ వేదముయొక్క పని. పవిత్రమైన వేదములందు, యింత పవిత్రమైన సారము కలిగివున్నదనే సత్యము ప్రతి ఒక్క వ్యక్తికూడను గుర్తించటానికి ప్రయత్నించాలి.

**'కోరవలసినవి కోరండి; ఆ కోరికలనుకూడా అదుపులో పెట్టుకోండి'**

గాలి మొదలు, నీరు మొదలు, శబ్దముమొదలు ప్రతి విషయాన్నికూడను యీ వేదము అన్ని విధాలా అనుగ్రహిస్తూవచ్చింది. దానినే మానవుడు 'చమే, చమే, చమే', అని కోరుతూ



sri sathyasaivacharamrutam

వస్తున్నాడు. వేదమునందు రెండు విధములైనవిగా వుంటున్నాయి. నమకము, చమకము. చమకమంతా కావాలి, కావాలి, కావాలి నాకు అన్నీ కావాలి. దాహమై పోతుంది. కొంచెం నీరు కావాలి. ఆ నీరు యిస్తే అంతటితో తృప్తి పడడు. ఒక cool drink కావాలి. ఆ cool drink యిస్తే తృప్తిపడడు. ఒక Ice cream కావాలి. ఈ విధముగా ఆశలు పెరుగుతూ పెరుగుతూ పోతూ వుంటుంది. కనుకనే యీ వేదములో చమకములోపల ఓ భగవంతుడా! నాకు చల్లని గాలి అందించు. ఆ గాలికూడను నాకు యెంత కావాలో అంతే అందించు. ఉక్కిరి బిక్కిరి అయ్యే రీతిగా నాకు అందించకూడదు. నాకు చక్కని రుచికరమైన ఆహారమునందించాలి. ఈ ఆహారము అజీర్ణము చేయకూడదు. నాకు అనాయాసముగా వుంటుండాలి. ఆయాసము కలగించకూడదు' అనే కోరికలుంటుయి. వేదము తెలిసినవారినడగండి. చమకములో అన్నీ యిలాంటివే వుంటున్నాయి. కోరికలు. కోరికలు. కోరికలు. నమకము కేవలము భగవత్ప్రార్థన. 'నీవే కావాలి, నీయొక్క సంకల్పము, నీయొక్క ప్రేమ, నీయొక్క జ్ఞానము, నీయొక్క దర్శనము, నీయొక్క స్పర్శనము యివి మాత్రమే నాకు కావాలి', అనే ప్రార్థనలుంటాయి. ఈ నమక, చమకములలో వుండిన తారతమ్యాన్ని ప్రజలకు బోధించలేకపోతున్నారు. మొదలు కోరవలసినదే. తరువాత విసర్జించవలసినదే. ఈ కోరిన తరువాత, అనుభవించిన తరువాత విరక్తి మనలో ఆవిర్భవిస్తుంది. కనుక, కోరవలసినవి కోరండి; ఈ కోరికలుకూడ అదుపులో పెట్టుకోండి! 'నశ్రేయోనియమంవినా'. ఈ నియమమే లేకపోతే మన జీవితము చాలా బాధలకు గురౌతుంది. కోరికలు వుండకూడదని చెప్పటంలేదు. అవసరమైనవి కోరండి. సాధ్యమైనంతవరకు యీ కోరికలు తగ్గించుకొని దైవాన్ని అధికముగా మీరు రమించండి.

**దైవప్రేమను పెంచుకోవటమే ప్రధానమైన సాధన**

దైవమే మన చెంతవుంటుంటే సర్వము మనకు లభ్యమౌతుంది. దైవమే దూరమైతే మనము సర్వము దూరము చేసుకున్నవారమౌతాము.

**నీకే కానివాడనైతే లోకమాతా**
**నేను లోకమందు లోకువౌదు లోకమాతా**

srisathyasaivachanamrutam

లోకమాతకే మనము లోకువైపోతే యింక లోకములో మనము దేనిని అనుభవించగలము? దేనిని ఆనందించగలము? తల్లికి దూరమైన పుత్రుడు యే సుఖాన్ని అనుభవించలేడు. అందులో సామాన్యమైన తల్లికాదు దైవము. ఈ దివ్యమైన తల్లి, భవ్యమైన తల్లి, నవ్యమైన తల్లి, నవీనమును అందించే తల్లి, నిత్యనవీనముతో నిల్చిన తల్లి, ఎప్పటికప్పుడే క్రొత్తగా వుంటుంటాది. ఒక చిన్న విషయాన్ని మీరు గుర్తించుకోండి. అనేకమంది సంవత్సరముల తరబడి ప్రశాంతినిలయములో నివసిస్తూ వుంటారు. 10 దినములు 15 దినములు నివసించేవారుకూడ వుంటారు. తెల్లవారి వస్తూనే దర్శనము చేసుకుంటారు, స్వామిని. ఒక దినము రెండు దినములు చూస్తే చాలదా? కానీ, ఆ చూసిన స్వామినే నిత్యము తెల్లవారి చూసినా తిరిగి సాయంకాలము చూడాలని, సాయంకాలము చూస్తే తిరిగి తెల్లవారి చూడాలని యీ విధముగా సంవత్సరముల తరబడి చూడాలనుకుంటే ఎంత నిత్యసుందరము, నిత్యయవ్వనము! ఒక్కతూరి చూచి తృప్తిపడిపోయినవారులేరు. తెల్లవారి అందరు నిశ్శబ్దముగా అటువైపునా యిటువైపున కూర్చొని కన్నులన్నియుకూడను ఆ ద్వారమువైపున చూస్తూ వుంటాయి. నిన్న చూసిన స్వామియేకదా, యింక యెందుకు చూడాలి మరి? కాదు కాదు. తిరిగి చూడాలి. తిరిగి చూడాలి. ఆ విధానము, ఆ ప్రేమయందే యిమిడి వుంటున్నాది, సర్వము. నిత్య నూతనముగా వుంటుంటాది. యీ విధమైన భావములు ఒక్క దైవానికి, భక్తులకు మాత్రమే సన్నిహిత సంబంధము. ఈ సంబంధబాంధవ్యములు అభివృద్ధి గావించుకోటమే ప్రధానమైన లక్ష్యము. భూమానంద చెప్పాడు 'యిదే మన ఆనందము. ఇదే మన సాయుజ్యము. ఇదే మన సాలోక్యము. ఇదే మన సామీప్యము. ఇలాంటి ఆనందమును అనుభవించటమే మన జీవితగమ్యము' అన్నాడు. అట్టి దైవప్రేమను పెంచుకోటమే ప్రధానమైన సాధన. అన్ని వేదములు బోధించునది అదియే! కనుక ప్రేమమయులై, ప్రేమతత్వాన్ని ప్రకటితము గావించుకుంటూ, ప్రేమానందమును అనుభవించటానికి ప్రయత్నము చేయండని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 29-09-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivahini.org